సాక్షి
కర్నూలు
బుధవారం । 22 । నవంబర్ । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్న, బయలు వీరభద్ర స్వామికి మంగళవారం పూజలు నిర్వహించి ప్రత్యేక నైవేధ్యాన్ని సమర్పించారు.



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం 1,930 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా డ్యాంలో 1.152 టీఎంసీల నీరు ఉంది.



వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: జిల్లాలో నేటి నుంచి ఈనెల 26వ తేది వరకు చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని బనవాసి కేవీకే శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.

న్యూస్‌రీల్

పంట నష్టం జాబితాల అప్‌లోడ్‌కు నేడు ఆఖరు

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావం వల్ల కలిగిన పంట నష్టం ఎన్యూమరేషన్ జాబితాలను మండలాల వారీగా బుధవారం సాయంత్రంలోగా తమ కార్యాలయానికి అప్‌లోడ్ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఆదేశించారు. కరువు ప్రాంతాలుగా గుర్తించిన 24 మండలాల్లో ఈ–క్రాప్ డేటా ఆధారంగా పంట నష్టపోయిన రైతుల జాబితాలు తయారు చేయడంలో వ్యవసాయ యంత్రాంగం నిమగ్నమైంది. 34 కాలమ్స్ ప్రొఫార్మలో రైతుల వివరాలను సిద్ధం చేస్తున్నారు. ఒక రైతుకు రెండు హెక్టార్ల వరకు మాత్రమే నమోదు చేస్తారు. పరిహారం రెండు హెక్టార్ల వరకే ఇవ్వాలనేది కొన్నేళ్లుగా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పెట్టిన నిబంధన. సవరించిన స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రొఫార్మా సిద్ధం చేస్తున్నారు.

పది పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగించినట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజుతో పాటు, ఒకేషనల్ అభ్యర్థులు, మైగ్రేషన్ సర్టిఫికెట్ల కోసం రుసుమును ఆన్‌లైన్‌లో నామినల్ రోల్‌తో పాటు www. bse.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో చెల్లించాలన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో వచ్చే నెల 1వ తేది నుంచి 4వ తేదిలోపు, రూ.200 ఫైన్‌తో వచ్చే నెల 5నుంచి 9వ తేదిలోపు, రూ.500 ఫైన్‌తో వచ్చే నెల 10 నుంచి 14వ తేదిలోపు ఫీజు చెల్లించవచ్చునన్నారు. అన్ని సబ్జెక్టులకు రెగ్యులర్ అభ్యర్థులకు రూ.125, 3 సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉన్నా రూ.125, 3 సబ్జెక్టుల వరకు అయితే రూ.110, వొకేషనల్ అభ్యర్థులకు రూ.60 అదనంగా, తక్కువ వయస్సు గల పిల్లలకు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికేట్ కోసం రుసుము రూ.80 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. షెడ్యూల్ కులాలు/షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు పరీక్ష రుసుము చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుందన్నారు.

రబీ రైతులు సహకరించాలి

- తీవ్ర వర్షాభావం వల్ల ఆయకట్టుకు నీరు ఇవ్వలేం
- జిల్లా కలెక్టర్ డా.జి సృజన

కర్నూలు సిటీ: తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి లభ్యత తక్కువగా ఉండడంతో రబీ సీజన్‌లోని ఆయకట్టుకు నీరు అందించేందుకు వీలు కాదని జిల్లా కలెక్టర్ డా.జి సృజన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టులో జరిగిన ఉమ్మడి జిల్లా సాగు నీటి సలహా మండలి సమావేశంలో జలాశయాల్లోని నీటి లభ్యతను బట్టి ఖరీఫ్ సీజన్‌లో తుంగభద్ర దిగువ కాలువ, కేసీ కాలువ, నది తీరం వెంబడి ఉన్న స్కీమ్‌ల కింద ఆయకట్టు సాగుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కష్టమైనా ఖరీఫ్ పంటలకు నీటిని అందించి కాపాడమని, ప్రస్తుతం తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో నీటి ప్రవాహం లేకపోవడంతో నది తడారి పోయిందన్నారు. ఈ విషయాన్ని రబీ రైతులు గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు. గాజులదిన్నె ప్రాజెక్టులో కూడా 1.23 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఈ నీటిని డోన్, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల తాగు నీటి అవసరాలకు వినియోగించనున్నామన్నారు. తుంగభద్ర డ్యాంలో కేసీ వాటా నీరు 2.90 టీఎంసీలు మాత్రమే ఉందని, అదే విధంగా సుంకేసుల బ్యారేజీలో 1.2 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని, ఈ నీటితోనే కర్నూలు నగర పాలక సంస్థతో పాటు నదీ తీర గ్రామాల దాహార్తి తీర్చాల్సి ఉంటుందన్నారు.

విభిన్న ప్రతిభకు 'అందలం'

76 మంది దివ్యాంగులకు ఉద్యోగాలు

- 1,984 మందికి రూ.3.19 కోట్ల విలువ చేసే 9 రకాల పరికరాలు
- 410 మంది ట్రాన్స్‌జెండర్లకు సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు
- దివ్యాంగుల ఉపాధికి రూ.39.12 లక్షల రుణాలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు) మనోధైర్యంతో ముందడుగులు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో చేయూతను అందిస్తోంది. దివ్యాంగులతో పాటు వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమానికి కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. చిన్నారులకు అమ్మ ఒడి మొదలుకొని వయోవృద్ధులకు పెన్షన్ల వరకు అనేక రూపాల్లో ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. అలాగే ఉన్నత విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగులకు ఓ వైపు జగనన్న విద్యా దీవెన ద్వారా ఆదుకుంటూనే, మరోవైపు వారికి అవసరమైన ల్యాప్‌టాప్, టచ్‌ఫోన్, హియరింగ్ ఎయిడ్, ట్రైసైకిళ్లు, బ్రెయిలీ కేన్స్ తదితర పరికరాలను అందిస్తూ భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. తాజాగా అర్హులైన శారీరక వికలాంగులకు ఉచితంగా మోటరైజ్‌డ్ సైకిళ్లను అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే వయో వృద్ధులకు వీల్ చైర్లు, క్రచ్చెస్, అడల్ట్ సిక్స్‌ను అందిస్తోంది. ఈ పరికరాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.3.19 కోట్లను వెచ్చించింది. హిజ్రాల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు వీలుగా సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను అందిస్తోంది. జిల్లా, డివిజన్ కేంద్రాలకు దివ్యాంగులు వచ్చేందుకు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారి మండలాల్లోనే శిబిరాలను ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోంది. అలాగే రెండు జిల్లాల్లోని 14 మంది దివ్యాంగులకు ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ కింద రూ.39.12 లక్షలను రుణంగా అందించడం విశేషం.



మోటరైజ్డ్ వెహికల్స్ పొందిన విభిన్న ప్రతిభావంతులు



ట్రైసైకిల్స్ అందుకున్న దివ్యాంగులు

డీఎస్సీ, నాన్ డీఎస్సీ కింద 76 మందికి ఉద్యోగాలు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మూడున్నరేళ్లలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద అర్హులైన దివ్యాంగులకు ఉద్యోగాలు వచ్చాయి. 2018–19లో డీఎస్సీ, నాన్ డీఎస్సీ కింద 23, 2019–20, 2020–21లో 36, 2021–22లో 8, 2022–23లో ఏడుగురికి ఉద్యోగాలు కల్పించారు. బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించి ఏడు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేయగా, రెండు పోస్టులు భర్తీ కాగా, మిగిలిన ఐదు పోస్టులకు అర్హులు లేకపోవడం వల్ల ఖాళీగా ఉన్నాయి. అలాగే జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న వసతి, విద్యా దీవెన కింద కూడా ఉపకార వేతనాలు ఆయా సంక్షేమ శాఖల ద్వారా అందుతున్నాయి.

ట్రాన్స్‌జెండర్స్‌కు సర్టిఫికెట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 410 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను జారీ చేశారు. కర్నూలు జిల్లాలో 185, నంద్యాల జిల్లాలో 225 మందికి గుర్తింపు కార్డులు అందించారు. ఈ సర్టిఫికెట్ల వల్ల అనేక ఉపయోగాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తించాలంటే సంబంధిత ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లు చాలా అవసరం. ఒక విధంగా చెప్పాలంటే ఈ సర్టిఫికెట్ ఆధార్‌కార్డులా ఉపయోగపడనుంది. ఈ నేపథ్యంలోనే 1,410 మంది సీనియర్ సిటిజన్లకు కూడా గుర్తింపు కార్డులను అందించారు. ముఖ్యంగా స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ సెంటర్‌లో ఇప్పటి వరకు 11,273 మందికి ట్రీట్‌మెంట్ ఇచ్చారు.

డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్ ద్వారా ట్రీట్‌మెంట్

మద్యపానం, మాదకద్రవ్యాలకు బానిసలైన వారికి పునరావాసం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్లలో కర్నూలు జిల్లాలో 465 మంది ఇన్‌పేషంట్లు, 11,161 మంది అవుట్ పేషంట్లకు.. నంద్యాల జిల్లాలో 110 మంది ఇన్‌పేషంట్లు, 4,425 మంది అవుట్ పేషంట్లకు చికిత్స అందించారు.

ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగులకు అందించిన 9 రకాల పరికరాలు ...

పరికరం పేరు	ఎంత మందికి	విలువ
ల్యాప్‌టాప్స్	253	రూ. 88,55,000
టచ్‌ఫోన్స్	180	రూ. 27,00,000
హియరింగ్ ఎయిడ్స్	300	రూ. 7,50,000
ట్రై సైకిల్స్	320	రూ. 16,00,000
వీల్ చైర్స్	238	రూ. 16,66,000
క్రచ్చెస్	153	రూ. 1,53,000
అడల్ట్ సిక్	300	రూ. 1,50,000
బ్రెయిలీ కేన్	100	రూ. 20,000
రెట్రోఫిటెడ్ మోటరైజ్‌డ్ వెహికల్స్	140	రూ.1,61,00,000
మొత్తం:	1,984	రూ.3,19,94,000

దివ్యాంగులకు అన్ని రకాల సహకారం



రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అనేక రూపాల్లో సహాయ సహకారాలను అందిస్తోంది. చిన్నారుల నుంచి వయోవృద్ధుల వరకు వివిధ రకాల పరికరాలను పంపిణీ చేస్తోంది. అలాగే వారి ఆర్థిక పురోగతికి 3 శాతం వడ్డీతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 మందికి రూ.39.12 లక్షల మేర రుణంగా అందించాం. హిజ్రాల సంక్షేమం, ఉపాధి అవకాశాలకు వీలుగా ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో కలిసి కర్నూలు, నంద్యాల ప్రాంతాల్లో అవగాహన సదస్సులను నిర్వహించాం.

– రయిస్ ఫాతిమా, ఏడీ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ

మత్స్యకారులు వ్యాపారులుగా ఎదగాలి



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): మత్స్యకారులు వ్యాపారులుగా ఉన్నత స్థానానికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓఎన్‌జీసీ కార్యకలాపాలతో జీవనోపాధి కోల్పోయిన 23,458 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.11,500 చొప్పున ఆరు నెలలకు సంబంధించి రూ.69 వేల ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జి.సృజన, ఏపీ బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శివ శ్యామలకుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, మత్స్యశాఖ జేడీ శ్యామల, మత్స్యకార సొసైటీ సభ్యులు, ఆక్వా రైతులు పాల్గొని వీక్షించారు. అనంతరం ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులు వ్యాపారులుగా ఎదగడానికి ఫిష్ ఆంధ్ర స్టాళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. రాయలసీమ లాంటి కరువు ప్రాంతాల్లోనూ మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంద న్నారు. అనంతరం జిల్లాలోని మత్స్యకారులకు కలెక్టర్ మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ పంచ శైవ క్షేత్ర దర్శిని యాత్ర సర్వీసు ఏర్పాటు

నంద్యాల టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రముఖమైన ఐదు శైవ క్షేత్రాలను భక్తులు సందర్శించేలా పంచ శైవ క్షేత్ర దర్శిని పేరుతో స్పెషల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డీఎం గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ కార్తీక పౌర్ణమి, 27వ తేదీ కార్తీక సోమవారం, డిసెంబర్ 4 తేదీ సోమవారం రోజుల్లో నంద్యాల బస్టాండ్ నుంచి ఉదయం 6 గంటలకు బస్సు సర్వీసు బయలుదేరుతుందన్నారు.

రాష్ట్రంలో మంచి పరిపాలన



నా వయస్సు 65 సంవత్సరాలు. వైఎస్ఆర్ బీమా, పెన్షన్ కోసం ఇంటి, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. వలంటీర్ మా ఇంటికి వచ్చి సచివాలయంలో వివరాలు ఇవ్వమంటే ఇచ్చేశా. రెండు రోజులకే ఫోన్ చేశారు. వెళ్లి ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రం అందుకున్నా. టీడీపీ హయాంలో కుల ధ్రువీకణ పత్రం కావాలంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. అయినా పని అయ్యేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రాష్ట్రంలో మంచి పరిపాలన కొనసాగుతోంది. – టి. తులసన్న, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, కర్నూలు

కౌలు రైతులను ఆదుకున్నారు



నాకు మూడుఎకరాల పొలం ఉంది. అదనంగా మరో 10 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. ఖరీఫ్, రబీ సాగు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.13,500తో పురుగుల మందులతో పాటు విత్తనాలు కొనుగోలు చేసుకుంటున్నా. గతంలో వ్యవసాయానికి పెట్టుబడి కోసం అప్పులు చేసేవాళ్లం. ఇప్పు డు ఆ పరిస్థితి లేదు. సకాలంలో మందులు,విత్తనాలు అందుతున్నాయి. విపత్తుల సమయంలో పంటలు నష్టపోతే ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులందరికీ పారదర్శకంగా ఇన్సూరెన్స్ నగదు అందుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కౌలు రైతులను ఆదుకున్నారు.

– తిక్కన్న,కౌలు రైతు, మొలగవల్లి, ఆలూరు మండలం



రోడ్లకు నిధుల వరద

- నెలన్నరలో రూ.317.69 కోట్లతో 272 పనులకు అనుమతులు



కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఇతోధికంగా నిధులను విడుదల చేస్తోంది. కేవలం నెలన్నర వ్యవధిలోనే జిల్లాలో 272 వివిధ రకాల రోడ్ల నిర్మాణాలకు రూ.317.69 కోట్లతో పాలనా అనుమతులను మంజూరు చేసింది. ఈ పనులకు వెంటనే టెండర్లను ఆహ్వానించి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వైపు సచివాలయ పరిధిలో వివిధ రకాల పనులు చేపట్టేందుకు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలను విడుదల చేయడంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు (రోడ్లు, డ్రైనేజీలు) చేపట్టేందుకు వీలుగా ఒక్కో మండలానికి రూ.60 లక్షల ప్రకారం జిల్లాలోని 21 మండలాలకు రూ.12.10 కోట్లను మంజూరు చేసింది.

- సీఎంఓ ఆదేశాల మేరకు పీఆర్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో గుర్తించిన హైఇంపాక్ట్ రోడ్లకు సంబంధించి 39 పనులకు రూ.187.27 కోట్లకు పాలనా అనుమతులు వచ్చాయి.
- హై ఇంపాక్ట్ రోడ్లకు సంబంధించి ఆర్‌అండ్‌బీ పరిధిలోని 21 మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు రూ.45.60 కోట్లు, 9 స్టేట్ హైవేస్ రోడ్లకు రూ.34.40 కోట్లతో పాలనా అనుమతులను ఇచ్చారు.
- పత్తికొండ నియోజకవర్గంలో పీఎంజీఎస్‌వై కింద ఆరు రోడ్లు, రెండు హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణాలకు రూ.35.52 కోట్లను మంజూరయ్యాయి.
- కల్లూరు మండలం నాయకల్లు గ్రామం ఎన్‌హెచ్ 44 నుంచి ఈశ్వరమ్మ అవ్వ ఆశ్రమం వరకు రోడ్డును నిర్మించేందుకు రూ.80 లక్షలను మంజూరు చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు డీసీసీబీ బోర్డు సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు బోర్డు సమావేశం గురువారం నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నారు. సమావేశంలో పాలకవర్గం సభ్యులతో పాటు ఆప్కో అధికారులు, జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొంటారు.



టీడీపీ విష ప్రచారాన్ని తిప్పికొడుదాం

- పేదలకు వైఎస్ జగన్ చేసే సంక్షేమం ప్రతిపక్షాలకు కనిపించడం లేదు
- పథకాలపై విమర్శలు చేసి.. ఇప్పుడు వాటితోనే ప్రజల ముందుకు వెళ్తున్నారు
- 2024లో పెత్తందారులు, పేదల మధ్యే ఎన్నికలు
- జిల్లా సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ సంజీవ్‌కుమార్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, సుధాకర్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(రాజ్‌విహార్): పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వంపై టీడీటీ విష ప్రచారం రోజు రోజుకు పెరిగిపోతోందని, దీనిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీడియా, సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో కర్నూలు జిల్లా సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ ఇంద్ర సేనారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ఆర్ ఆశయ సాధన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టారన్నారు. ఏళ్ల తరబడి ప్రజల్లో తిరిగి వారి కష్టాలు తెలుసుకుని అధికారంలోకి రాగానే వాటిని తీరుస్తున్నారని చెప్పారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతం అమలు చేశారన్నారు. చెప్పని హామీలను సైతం ఆచరణలోకి తెచ్చారన్నారు. ఈవన్నీ కనిపించనట్లు ప్రతిపక్ష నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలపై అనేక విమర్శలు చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు అవే పథకాలను కాపీ కొట్టి ప్రజల ముందు మినీ మేనిఫెస్టోతో తిరుగుతున్నారని చెప్పారు. కర్ణాటక, ఇతర రాష్ట్రాల హామీలు సైతం ఆ పార్టీ మేనిఫెస్టోలో ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికలు పేదలు, పెత్తందార్ల మధ్య జరిగేవని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పక్షాన ఉన్నారని, మనం ఆయనకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేసిన, చేస్తున్న మేలును మరింత స్పష్టంగా ప్రజలకు వివరించడంతో పాటు తెలుగుదేశం పార్టీ నేతలు చేసే తప్పుడు, విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. ఉద్యోగాల కల్పన, విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు, మన తెలుగు బిడ్డలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అమెరికాలో ప్రసంగించిన విషయాలను జనంలోకి తీసుకెళ్లాలన్నారు. కార్యకర్తలకు పూర్తిగా అండగా ఉంటానని, తప్పుడు పోస్టులపై వెంటనే స్పందించి ఖండించి, వాస్తవాలు తెలపాలని సూచించారు.

- పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ గత పాలకులకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మంచి చేస్తున్నారని చెప్పారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా పేదల ఖాతాలోకి నేరుగా నగదు జమా చేసిన ప్రభుత్వం మనదే అన్నారు.
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మాట్లాడుతూ పవన్ కల్యాణ్ జెండా, ఎజెండా లేని నాయకుడని, కేవలం చంద్రబాబు కోసమే ఆయన పని చేస్తున్నారని చెప్పారు. బాబు అరెస్టు అయితే కొడుకు లోకేష్ వెళ్లి ఢిల్లీలో దాక్కుంటే.. పవన్ మాత్రం రోడ్లపైకి రావడం ఆశ్చర్యం కలిగించిందన్నారు.
- ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పెత్తందారులు, పేదలకు మధ్య యుద్ధం జరుగబోతోందని, మనం పేదల పక్షాన పోరాడే వైఎస్ జగన్ వెంట ఉండాలన్నారు.
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లోనూ ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో మొత్తం స్థానాలు గెలుచుకోవాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు.
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ టీడీపీ నేతల దుర్మార్గాలను ఎండగట్టాలన్నారు. మన సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.
- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్‌సీపీ సర్కారుచేసిన మంచిని, వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు.
- కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పాలనను ప్రజలకు తెలపడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాలన్నారు.
- మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు.
- సమావేశంలో పార్టీ నాయకులు ఆదిమోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సీహెచ్ మద్దయ్య, సుభాష్ చంద్రబోస్, ఆదిమూలపు సతీష్, యూనుస్, శ్వేతారెడ్డి, కృష్ణకాంత్, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

సెంట్రల్ బృందం బెలుం గుహల సందర్శన



గుహల ఆవరణలో సెంట్రల్ బృందం సభ్యులు

కొలిమిగుండ్ల: భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ సెక్రటేరియట్‌లో నూతనంగా నియమించబడిన కామన్ గ్రాడ్యుయేట్ లెవల్ సెక్షన్ ఆఫీసర్స్ (సీజీఎల్‌ఈ) టీం సభ్యులు మంగళవారం బెలుం గుహలను సందర్శించారు. 35 మందితో కూడిన టీం సభ్యులకు గుహల వద్ద ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, ఈఓఆర్డీ శ్రీహరి, పంచాయితీ కార్యదర్శులు నరేష్, పర్వేజ్ స్వాగతం పలికారు. అనంతరం గుహ లోపలి భాగాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన కోటిలింగాలు, పాతాళగంగ, ఊడలమర్రి తదితర ప్రదేశాలను తిలకించారు. భారత్ దర్శన్‌లో భాగంగా దేశంలోని పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక ప్రాంతాల సందర్శిస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.

మహానందిలో పాము కలకలం



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ మోహన్

మహానంది: మహానందిలోని నవ వినాయకుల విగ్రహాల ప్రాంగణంలో మంగళవారం రాత్రి ఓ పాము కలకలం రేపింది. విద్యుత్ బల్బులు ఆన్ చేసేందుకు వెళ్లిన ఎలక్ట్రిషియన్ శ్రీను, లక్ష్మయ్యలు పామును గుర్తించారు. వెంటనే వారు స్థానిక అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. అనంతరం అక్కడికి చేరుకున్న మోహన్ పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశారు.

పెయ్యా దూడలే పుడతాయ్!

- పాడి రైతుకు ప్రభుత్వం భరోసా
- అందుబాటులోకి కృత్రిమ గర్భధారణ పద్ధతి
- రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఇంజెక్షన్ల సరఫరా
- జిల్లాకు 4 వేల డోసుల ఇంజెక్షన్లు మంజూరు

గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన గుర్రెడ్డి వ్యవసాయంతోపాటు పాడి ఆధారంగా జీవనం సాగిస్తున్నాడు. 5 గేదెలు, ఒక ఆవు ఉన్నాయి. పశు వైద్యాధికారుల సూచనలు, సలహా మేరకు ఆవుకు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ వేయించడంతో తొలిసారే ఆడ దూడ జన్మించింది. జననం అనంతరం ఆవు, దూడ ఆరోగ్యంగా ఉండటంతో ఆ కుటుంబానికి పాడి పరిశ్రమ నిర్వహణపై మరింత ధీమా పెరిగింది.



ఆరోగ్యంగా ఉన్న ఆవు, దూడ



గేదెకు గర్భధారణ ఇంజెక్షన్ వేస్తున్న వైద్యాధికారి

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్రప్రభుత్వం పాడి రైతులకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. వివిధ పథకాల ద్వారా పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో అమూల్ పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 'పాడి పశువులకు పెయ్యదూడలు పుట్టాలి.. రైతన్నకు లక్ష్మీకళ రావాలి' అన్న నినాదంతో తాజాగా కృత్రిమ పద్ధతిలో ఇంజెక్షన్ల ద్వారా పెయ్యదూడల (ఆడదూడలు) ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. రైతులకు పాడి, పంటలు రెండు కళ్లు. ఇవి ఒకదానిపై ఒకటి ఆధార పడి ఉండి రైతుల అభ్యున్నతికి దోహదపడుతున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 15 ప్రాంతీయ పశువైద్యశాలలు, 74 పశువైద్యశాలలు, 99 గ్రామీణ పశువైద్య కేంద్రాలు, 86 గోపాలమిత్ర కేంద్రాలు, 79 ఆర్‌బీకేలున్నాయి. జిల్లాలో 2.93 లక్షల నల్లజాతి పశువులు, 1.20 లక్షల తెల్లజాతి పశువులు ఉన్నాయి. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఆయా పశువైద్యశాలలకు ఇంజెక్షన్లు సరఫరా అవుతున్నాయి. గతంలో ఆవులు, గేదెలు చూడి కట్టాలంటే ఎద్దులు, దున్నలపై ఆధారపడాల్సి వచ్చేది. తర్వాత కృత్రిమ గర్భధారణ(సార్టెడ్‌సెమన్) ఇంజెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి గేదెలు, ఆవులు గర్భందాల్చి ఏదో ఒక దూడకు జన్మనిస్తే చాలని పాడి రైతులు భావించేవారు. కాలానికనుగుణంగా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం సంతరించుకోవడంతో పాడి పరిశ్రమలో మగజాతి పశువులకు ప్రాధాన్యం తగ్గింది. దీంతో ప్రతి రైతు తమ ఇంట పెయ్యదూడలే పుడితే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని భావిస్తున్నారు. వారి ఆశలు నిజం చేసేందుకు ప్రభుత్వం పెయ్యదూడల జననానికి కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లను అందుబాటులోకి తెచ్చింది. పెయ్యదూడల ఉత్పత్తికి ప్రభుత్వం ప్రత్యేకంగా గర్భధారణ ఇంజెక్షన్లు సరఫరా చేస్తుండటంతో ప్రతి రైతు ఇంట పెయ్యదూడల జననం సులభతరమైంది.

సబ్సిడీ ఇలా..

లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ సూది పూర్తి ధర రూ.1,350 ఉండగా ప్రభుత్వం రూ.850 సబ్సిడీ ఇస్తోంది. రైతులు రూ.500 భరించాల్సి ఉంది. మొదటి డోసుతో చూలు కట్టకపోతే రెండో సారి కూడా వేస్తారు. రెండు డోసులకు కలిసి ప్రభుత్వం ఈ ధరను నిర్ణయించింది. ఆవులు, గేదెలకు లింగనిర్ధారణ వీర్యంతో ఎదకు వచ్చినపుడు మాత్రమే సూది వేస్తారు. 21 రోజుల్లో మళ్లీ ఎదకు రాకపోతే చూలు కట్టినట్లే. రెండు డోసులు వేసినా పశువు చూలు కట్టకపోతే రైతు చెల్లించిన రూ.500 వెనక్కి చెల్లిస్తారు. చూలు కట్టి మగ దూడ పుడితే రూ.250 వెనక్కి ఇస్తారు.

జిల్లాకు 4 వేల డోసులు

పెయ్యదూడల అభివృద్ధి పథకాన్ని పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సిబ్బంది రైతుల్లోకి తీసుకుపోతున్నాయి. లింగనిర్ధారిత వీర్యం ఉపయోగించడంతో రైతులకు అవసరమైన.. మేలైన పెయ్యదూడలను 95 శాతంపైగా కచ్చితత్వంతో పుట్టించడం ద్వారా పాల దిగుబడి పెరగనుంది. దీంతో రైతుల ఆదాయం రెట్టింపయ్యే అవకాశం ఏర్పడింది, అలాగే గ్రామాల్లో మేలు జాతి పశుసంపద వృద్ధి చెందనుంది. పాడి పశువుల కృత్రిమ గర్భధారణకు సంబంధించి జిల్లాకు 4 వేల డోసులు కేటాయించారు. ఇందులో కోవెలకుంట్ల ప్రాంతీయ పశువైద్యశాలకు 220 డోసులు, నంద్యాలకు 826, డోన్‌కు 40, నందికొట్కూరుకు 130, బేతంచెర్లకు 80. పాణ్యంకు 368, వెలుగోడుకు 300. జూపాడుబంగ్లాకు 30, చాగలమర్రికి 140, సంజామలకు 60, బనగానపల్లెకు 100, ఆళ్లగడ్డకు 360, రుద్రవరం ప్రాంతీయ పశువైద్యశాలకు 750 డోసులు కేటాయించారు. ఒక్కో ఏడీ కార్యాలయ పరిధిలో ప్రతి నెలా 100 డోసులు వినియోగించాల్సి ఉంది.

పాడి రైతులకు ప్రోత్సాహం



వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాను. పెయ్యదూడల జననానికి ప్రభుత్వం కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లను అందుబాటులోకి తెచ్చింది. పాడిపరిశ్రమ అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుండటం శుభపరిణామం. – బలరాముడు, రైతు, బిజనవేముల, కోవెలకుంట్ల మండలం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడిరైతులంతా పెయ్యదూడల జననానికి సంబంధించిన ఇంజెక్షన్లను ఎదకు వచ్చిన ఆవులు, గేదెలకు వేయించాలి. కోవెలకుంట్ల ప్రాంతీయ పశువైద్యశాలకు 220 డోసులు కేటాయించారు. పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – కృష్ణకుమార్, పశువైద్యాధికారి, కోవెలకుంట్ల

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

ఆదోని సెంట్రల్ : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థుల మృతికి కారకులైన ఉపాధ్యాయులపై జిల్లా విద్యాధికారి రంగారెడ్డి మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. పెద్ద హరివాణం గ్రామంలోని ప్రభుత్వ మండల ప్రాథమిక పాఠశాలలో 5వతరగతి చదువుతున్న ఎ. మంజు, ఎం. అక్బర్ బాషా అను విద్యార్థులు సోమవారం నీటి ట్యాంకులో పడి మృతి చెందారు. పాఠశాల సమయంలో ఈ సంఘటన జరగడంతో జిల్లా కలెక్టరు సృజన విచారణకు ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు విచారణ జరిపిన డీఈఓ.. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు టి. రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయుడు మనోహర్‌ను సస్పెండ్ చేశారు. ఈ ఉత్తర్వులు సదరు ఉపాధ్యాయులకు అందించినట్లు మండల విద్యాధికారి బి. శివరాములు తెలిపారు.



కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	2660	7168
పొద్దుతిరుగుడు	3020	4570
ఆముదం	3559	5461
వాము	15010	15010
ఉల్లి	617	3859
ఎండుమిర్చి	3099	20919
శనగలు	4260	5811
కందులు	9517	9517
మొక్కజొన్న	1250	2030
మినుములు	2011	2011
కొర్రలు	4000	4000
సోయాచిక్కుడు	3800	4431

ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు

కర్నూలు(కల్చరల్): అయోధ్య రామమందిర నిర్మాణం సందర్భంగా నిర్వహించనున్న జూన్ సంపర్క అభియాన్‌లో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలు అందజేయాలని కేంద్ర విశ్వహిందూ పరిషత్ సహ కార్యదర్శి నాగరాజన్ సూచించారు. నగరంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5 లక్షల హిందూ కుటుంబాలకు పవిత్ర అక్షింతలు, అయోధ్య మందిర నమూనా ఫొటో, కరపత్రం ఇవ్వాలన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో జరగబోయే 'రామ్ లల్లా విరాజ్ మాన్' మహా ప్రతిష్టాన సందర్భంగా దేశ వ్యాప్తంగా పండుగలా జరుపుకోవాలన్నారు. ఆలయాల అలంకరణ, నామ సంకీర్తనలు చేయాలని, అయోధ్యలో జరిగే మహా ప్రాణప్రతిష్టాపనా ప్రత్యక్ష ప్రసారం ద్వారా పెద్దపెద్ద తెరలు ఏర్పాటు చేసుకుని వీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మందిర అర్చక ప్రముఖ్ శివశంకర్, రాష్ట్ర అధ్యక్షులు నందిని సాయి రెడ్డి, సహ కార్యదర్శి ఎస్.ప్రాణేష్ , కోశాధికారి సందడి మహేశ్వర్ పాల్గొన్నారు.

రగ్బీ విజేతలు కర్నూలు, అనంతపురం





రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న కర్నూలు బాలుర జట్టు, అనంతపురం బాలికల జట్టు

- గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేసిన డీఈఓ డాక్టర్ రంగారెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్ -17 స్కూల్‌గేమ్స్‌లో కర్నూలు,అనంతపురం జట్లు సత్తాచాటాయి.రెండు రోజులుగా నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు మంగళవారం ముగిశాయి.ఫైనల్ పోరులో బాలుర విభాగంలో నెల్లూరు జట్టుపై 17-10 స్కోర్‌తో కర్నూలు జట్టు విజయం సాధించింది. రెండు, మూడుస్థానాల్లో నెల్లూరు, ప్రకాశం జట్లు నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో నెల్లూరు జట్టుపై 5-0 స్కోర్‌తో అనంతపురం జట్టు గెలుపొందగా, రెండు, మూడు స్థానాల్లో నెల్లూరు, ప్రకాశం జట్లు నిలిచాయి. విజేత జట్లకు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి. రంగారెడ్డి అభినందించి ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. గెలుపోటములు సహజమని, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ సంఘం పరిశీలకులు నాగలింగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు వ్యాయామ ఉపాధ్యాయులు ఎండీ బాష పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీ సుధాకర్ రెడ్డి

కర్నూలు సిటీ: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సెట్కూరు సీఈఓ పి.వి. రమణ, దిశా మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో జిల్లా యువజన, సర్వీసుల శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, దిశా మొబైల్ యాప్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ బాధితుల్లో యువత, విద్యార్థులే అధికమని చెప్పారు. ఈ నేపథ్యంలో కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొందరు నిమిషాల్లో లోన్ ఇస్తామని నమ్మించి తర్వాత మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. మొబైల్, ఇంటర్నెట్ వినియోగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర వాటిలో ఫొటోలను అప్‌లోడ్ చేయకూడదని సీఐ కళా వెంకట రమణ విద్యార్థినులకు సూచించారు. ప్రతి ఒక్కరు తమ మొబైల్ ఫోన్‌లలో దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆదోని అర్బన్: బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి హాలహర్వి గ్రామం వద్ద చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు మండలం కురుకుంద గ్రామానికి చెందిన మాబు(35) పని నిమిత్తం గూళ్యం గ్రామానికి సోమవారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో హాలహర్వి వద్ద ఆవు అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి కిందపడిపోయాడు. స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంపై హాలహర్వి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేసీలో యువకుడి గల్లంతు



శివ (ఫైల్)

కర్నూలు : ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు కేసీ కెనాల్‌లో గల్లంతయ్యాడు. మంగళవారం ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కర్నూలు బుధవారపేటకు చెందిన హరిబాబు, లక్ష్మీ దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుర్లు సంతానం కాగా ఇద్దరు ఆడపిల్లలకు వివాహమయ్యింది. తల్లి లక్ష్మీదేవి కిడ్నీ జబ్బుతో ఏడేళ్ల క్రితం మృతిచెందింది. తండ్రి హరిబాబు ప్లంబర్‌గా పనిచేస్తుండగా కుమారుడు శివ (26)గౌండా పని చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. అదే కాలనీకి చెందిన సుధాకర్, ప్రశాంత్‌తో కలిసి శివ మంగళవారం మధ్యాహ్నం వినాయక్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. అయ్యప్పస్వామి గుడి వద్ద ముగ్గురూ కలిసి నీటిలోకి దిగి సరదాగా కొద్దిసేపు ఈత కొట్టారు. అయ్యప్పస్వామి గుడి వైపు నుంచి అవతలి ఒడ్డుకు శివ ఈత కొట్టుకుంటూ వెళ్లి తిరిగి ఇవతలి గట్టుకు వచ్చే ప్రయత్నంలో నీళ్లలో మునిగిపోయాడు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో స్నేహితులు సుధాకర్, ప్రశాంత్ ఆ ప్రాంతంలో గాలించినా కనిపించలేదు. వెంటనే విషయం కుటుంబ సభ్యులకు చేరవేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు గంటల పాటు గాలించారు. దీంతో తండ్రి హరిబాబు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని కేసీ కెనాల్ వద్ద పోలీసుల చేత గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

ఓటరు జాబితా సవరణ ఫిర్యాదులను పరిష్కరించండి

- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశం

కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను(ఫారం-6, 7, 8) త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో రీసర్వే, హౌసింగ్, ఓటరు జాబితా సవరణ, ఆడుదాం-ఆంధ్ర తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసాయిదా జాబితాకు సంబంధించి డెమోగ్రాఫిక్, సిమిలర్, ఫొటోగ్రాఫిక్ ఎంట్రీస్‌కు సంబంధించి చెక్ లిస్టు జనరేట్‌లో పురోగతి లేదన్నారు. కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు మండలాలు అట్టడుగు స్థాయిలో ఉన్నాయన్నారు. రీసర్వేకు సంబంధించి 160 గ్రామాల్లో విలేజ్ సర్వేయర్, వీఆర్ఓ లాగిన్లలోని డేటా ఎంట్రీని 20లోపు పూర్తి చేయాలని చెప్పినా కేవలం 27 గ్రామాల్లో మాత్రమే పురోగతి కనిపించిందన్నారు. విలేజ్ సర్వేయర్, వీఆర్వో లాగిన్లలో డేటా ఎంట్రీకి సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్న అధికారులను కలెక్టరేట్‌కు పిలిపించి పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్యను ఆదేశించారు. అప్పుడు డిసెంబర్ 15 నాటికి ఫైనల్ ఆర్ఓఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలు ఉంటుందన్నారు. మరో రీసర్వేకు సంబంధించిన డేటా తహసీల్దార్ల లాగిన్లలోనూ ఎక్కువగా పెండింగ్‌లో ఉంటోందని, ఎప్పటికప్పుడు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మిలకు సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి డిసెంబర్ 15వ తేదీ నాటికి జిల్లాలో 17 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. కొన్ని మండలాల్లో పురోగతి లేకపోవడంతో ఆయా మండలాల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడుదాం-ఆంధ్రకు సంబంధించి కిట్లను వారంలోపు సచివాలయాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని డీఎస్ఓ రమణను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా స్థాయి మహిళ కబడ్డీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 24న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ సంఘం జిల్లా కార్యదర్శి కుబేర్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సుతో నిమిత్తం లేకుండా 75 కిలోలలోపు బరువు ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారిణులు ఈనెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు గోనెగండ్ల మండలంలో నిర్వహించనున్న ఎం.పెద్ద రంగస్వామి మెమోరియల్ ఆంధ్ర రాష్ట్ర సీనియర్ అంతర్ జిల్లాల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారిణులు ఆధార్ కార్డుతో పోటీలకు హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 9989643383 సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో పోలీసుల సోదాలు



ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో టీవీ-9 ప్రజానగర్ కాలనీలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఉదయమే పెద్ద ఎత్తున పోలీసులు కాలనీకి చేరుకుని అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో విస్తృత సోదాలు చేపట్టారు. సరైన ధృవపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో డీఎస్పీ విజయశేఖర్ సమావేశమై మాట్లాడుతూ నాటుసారా తయారీదారులపై నిరంతర నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలు మానుకుని గౌరవ ప్రదమైన జీవితం గడపాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ట్రైనీ డీఎస్పీ భావన, తాలూకా సీఐ శ్రీరాం, దిశ పీఎస్ సీఐ కళా వెంకటరమణ, కర్నూలు రూరల్ తాలూకా సీఐ కిరణ్‌కుమార్ రెడ్డితో పాటు ఆరుగురు ఎస్‌ఐలు, 50 మంది పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన పురుగు మందులు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుభరోసా కేంద్రాల వారీగా రైతులకు పురుగు మందులు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ రంగం సిద్ధం చేసింది. రైతులకు కచ్చితమైన ధరలకు నాణ్యమైన పురుగు మందులు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీకి దాదాపు అన్ని మండలాల్లో మన గ్రోమోర్ సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు సరఫరా చేస్తోంది. గతంలో ఆర్‌బీకేల ద్వారా పురుగు మందులు సరఫరా చేసేందుకు ఏపీ ఆగ్రోస్‌తో వ్యవసాయ శాఖ ఒప్పందం చేసుకుంది. అయితే అనుకున్న స్థాయిలో సరఫరా చేయలేకపోవడంతో ఆ బాధ్యతను ఏపీ సీడ్స్‌కు అప్పగించింది. ఈ నేపథ్యంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీతో ఏపీ సీడ్స్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 మన గ్రోమోర్ సెంటర్లకు 15 కిలోమీటర్ల దూరంలోని ఆర్‌బీకేలను మ్యాపింగ్ చేయడం ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉండగా 310 ఆర్‌బీకేలు మన గ్రోమోర్ సెంటర్లతో మ్యాపింగ్ అయ్యాయి. 25 రకాల ఆర్గానిక్ మందులు, 178 రకాల సూక్ష్మ పోషకాలు, 899 రకాల పురుగు మందులు అందుబాటులో ఉన్నట్లు వివరాలను ఆర్‌బీకేల్లో ఉంచారు. రైతులు ఆర్డర్ పెడితే నాలుగైదు గంటల్లోనే వీటిని సరఫరా చేస్తారని వ్యవసాయ అధికారులు తెలిపారు.